క్లుప్తంగా

పాఠశాలల్లో నూరు శాతం హాజరు నమోదుకు చర్యలు



పెదవేగిలో ఉపాధ్యాయుల సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ-2 అరుణ్‌కుమార్

పెదవేగి : పాఠశాలల్లో నూరు శాతం హాజరు ఉండేలా చర్యలు చేపట్టాలని పెదవేగి ఎంఈఓ-2 అరుణ్ కుమార్ అన్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో మండల పరిధిలోని ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడి బయట ఉండే పిల్లలను గుర్తించి వారిని పాఠశాలల్లో చేర్పించేందుకు చర్యలు చేపట్టాలని ఆయన తెలిపారు. నాడు-నేడు కార్యక్రమం ద్వారా పనులు పూర్తయిన అనంతరం మిగిలిన నిధులను వేరే పాఠశాలలకు ఉపయోగపడే విధంగా చర్యలు చేపట్టాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ-1 హెచ్ బుధవాస్, ఉపాధ్యాయులు సురేష్, ఎడ్వర్డ్, అన్నాజీ రావు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్షపై కరపత్రాల ఆవిష్కరణ



ఆరోగ్య సురక్ష కరపత్రాలను చిన్న వెల్లమిల్లిలో పంపిణీ చేస్తున్న దృశ్యం

ఉంగుటూరు: ఆరోగ్య సురక్ష, ప్రజలకు ఆరోగ్య భరోసా సర్వేలో భాగంగా శనివారం చిన్న వెల్లమిల్లిలో అవగాహన సదస్సు నిర్వహించారు. తాడేపల్లిగూడెం సబ్‌యూనిట్ అధికారి వైవీ లక్ష్మణరావు మాట్లాడుతూ ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఈ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గ్రామాల్లో ఏర్పాటు చేసే వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే వారిని గుర్తించి ఆసుపత్రులకు సిఫారసు చేస్తారని తెలిపారు. ఆరోగ్యశ్రీ నెట్‌వర్కు ఉన్న ఆసుపత్రి నుంచి ఒక డాక్టరు శిబిరానికి వస్తారని తెలిపారు. ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రచార కరపత్రాలను గ్రామంలో పంపిణీ చేశారు. వార్డు ఆరోగ్య కార్యదర్శులు, ఆరోగ్య సహాయకులు, ఆశలు,వలంటీర్లు పాల్గొన్నారు.

నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలు ప్రారంభం



కొవ్వలి ఉన్నత పాఠశాలలో క్రీడా పోటీలను ప్రారంభించిన హెచ్‌ఎం శర్మ

దెందులూరు: ప్రతి విద్యార్థికి విద్యతోపాటు క్రీడలు అత్యంత ముఖ్యమని నిరంతర సాధన, ప్రణాళిక, క్రమశిక్షణతోనే ఎంచుకున్న లక్ష్యాలు సాధించవచ్చని కొవ్వలి ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ఎస్ఎల్ఎన్‌వీజీ శర్మ అన్నారు. శనివారం కొవ్వలి ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ దెందులూరు నియోజకవర్గ ఆటల పోటీలను శర్మ, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జాయింట్ సెక్రటరీ ఎం.కృష్ణారావు ప్రారంభించారు నియోజకవర్గంలో నాలుగు మండలాల నుంచి 23 పాఠశాలలకు చెందిన 350 మంది బాలబాలికలు పోటీల్లో పాల్గొన్నారు. నియోజకవర్గ కోఆర్డినేటర్ రాజ్‌గోపాల్, దెందులూరు మండల కోఆర్డినేటర్ జక్కుల సురేష్‌కుమార్, పీడీలు రాధ, రవి, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులతో సాగులో లాభాలు



అమ్మపాలెంలో పంటలను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారిణి ప్రియాంక

పెదవేగి : రైతులు సరైన యాజమాన్య పద్ధతులు పాటించి పంటలు సాగుచేస్తే లాభాలు పొందవచ్చని పెదవేగి మండల వ్యవసాయాధికారి ఎం ప్రియాంక అన్నారు. మండలంలోని అమ్మపాలెంలో శనివారం ఏలూరు జిల్లా ఏరువాక కేంద్ర కో ఆర్డినేటర్ డాక్టర్ ఫణికుమార్ టి సుజాత, వీఏలు, వీహెచ్ఏలు, రైతులతో కలిసి అమ్మపాలెంలో పొలం బడి నిర్వహించారు. ఈ సందర్భంగా ఏరువాక కేంద్ర కో ఆర్డినేటర్ ఫణికుమార్ మాట్లాడుతూ పంటలపై ఆశించే చీడ పీడలను రైతులు ఎప్పటికప్పుడు గమనించి వ్యవసాయాధికారుల సలహాలు మేరకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. పంటలపై ఎక్కువగా ఆకుముడత, నుడి దోమ ఆశిస్తుందని చెప్పారు. వాటి నివారణకు రైతులు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. అనంతరం వ్యవసాయం, ఉద్యాన శాఖల అధికారులు రైతులతో కలిసి పొలం బడి క్షేత్రాన్ని సందర్శించారు.

ఉత్సాహంగా గణనాథుడి విగ్రహాల నిమజ్జనోత్సవం



భీమడోలు : జగనన్న కాలనీలో గణనాథుడి ఊరేగింపు



భీమడోలు : పోలసానిపల్లి బీసీ కాలనీలో అఖండ జ్యోతి కార్యక్రమం



పెదపాడు: సత్యవోలులో జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, ప్రసాదరావు

భీమడోలు: మండలంలో శనివారం గణేశ్ విగ్రహాల నిమజ్జనోత్సవాలు ఉత్సాహభరిత వాతావరణంలో ఘనంగా నిర్వహించారు. మండలంలోని భీమడోలు, గుండుగొలను, పూళ్ల, పోలసానిపల్లి తదితర గ్రామాల్లో చలువ పందిళ్లలో ప్రతిష్ఠించిన గణనాథుడి విగ్రహాలను భారీ ఊరేగింపుగా తీన్‌మార్ డప్పు వాయిద్యాలు, విచిత్ర వేషధారణలతో నృత్య ప్రదర్శనలు చేస్తూ పురవీధుల్లో ఊరేగించారు. భీమడోలు జగనన్న కాలనీలో స్థానికులంతా వినాయక చవితి వేడుకలను ఘనంగా నిర్వహించారు. నిత్యం స్వామి వారికి కాలనీ వాసులు ప్రత్యేక పూజలు చేసారు. నైవేద్యాలను సమర్పించారు. ముగింపును పురస్కరించుకుని గణేశ్ ప్రతిమను ఓ ట్రాక్టర్‌పై ఉంచి నిర్వాహకులు, మహిళలు, చిన్నారులు రంగులను పులుముకున్నారు. ఊరేగింపుగా వెళ్లి గోదావరి కాలువలో వినాయకుని విగ్రహాలను నిమజ్జనం చేసారు. భీమడోలులోని శ్రీహరినగర్‌లోని మహా గణపతి స్వామి ఆలయంలో అన్నదానం చేసారు. భీమడోలులోని మన్మహా గణనాథుని 59వ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా స్వామి వారు నలుపు రంగులో భక్తులకు దర్శనమిచ్చారు. పోలసానిపల్లి బీసీ కాలనీలో యువకులు వినాయకుని చవితి సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మహిళలు, భక్తులు భారీగా తరలివచ్చి జ్యోతులను వెలిగించారు.

పండగలు సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీకలు

పెదపాడు: పండుగలు సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీకలని ఉమ్మడి జిల్లా పరిషత్ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ అన్నారు. పెదపాడు మండలంలోని సత్యవోలులో గణేశ్ నవరాత్రి ముగింపు ఉత్సవాల్లో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా విఘ్నేశ్వర స్వామికి జెడ్పీ చైర్మన్ పద్మశ్రీ, ప్రసాదరావు దంపతులు ప్రత్యేక పూజలు చేసారు. అనంతరం స్వామి వారి గ్రామోత్సవాన్ని ప్రారంభించారు. వైఎస్సార్ సీపీ జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు ఘంటా ప్రసాదరావు తానే ఊరేగింపు ట్రాక్టరును నడిపి స్థానికులను ఉత్సాహపరిచారు. భారీగా బాణసంచా కాల్చి సంబరాలు జరిపారు. గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానికులు సొంగల ఉమామహేశ్వరావు, ఉపసర్పంచ్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

పెదపాడు: అంగన్‌వాడీల్లో ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యాన్ని లభిస్తుందని వసంతవాడ ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సంయుక్త, ప్రవీణ తెలిపారు. పౌష్టికాహార మాసోత్సవాల సందర్భంగా వసంతవాడలో అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలు కిశోర బాలికలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్లు సంయుక్త, ప్రవీణ మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సంపూర్ణ పోషకాహారం పథకంలో రాగి పిండి, అటుకులు, బెల్లం, ఎండు ఖర్జూరం, వేరుశనగ చిక్కీలు, గుడ్లు, పాలు, కందిపప్పు, నూనెతో పాటు ఫోర్టిఫైడ్ బియ్యం అందిస్తోందన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లోని సిబ్బంది ప్రభుత్వం అందిస్తున్న సేవలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో వసంతవాడ సెక్టారు పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలు, గర్భిణులు, బాలింతలు, తల్లులు పాల్గొన్నారు.

నాడు-నేడు పనులు వేగవంతం



దెందులూరు ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల



పాఠశాలలో ఆర్వో వాటర్ ప్లాంటు



పాఠశాలలో ఏర్పాటు చేసిన గురజాడ కళావేదిక

దెందులూరు: దెందులూరు ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో నాడు-నేడు మన బడి అభివృద్ధి పనులు వేగవంతంగా పూర్తవుతున్నాయి. ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి, రూ.35 లక్షలు నిధులు మంజూరు చేయించడంతోపాటు దాతలు మొటపర్తి వెంకటసుబ్బారావు, రామచంద్రమ్మ, వెంకట్ సహాయ సహకారాలతో బాలికల ఉన్నత పాఠశాలలో కార్పొరేట్‌కు దీటుగా సౌకర్యాలు ఏర్పాటవుతున్నాయి. నాలుగు అదనపు తరగతి గదులు, గురజాడ కళావేదిక, భోజన శాల, పాఠశాలలో టైల్స్ ఏర్పాటు, మోడ్రన్ టాయిలెట్ల నిర్మాణం , విద్యార్థులందరికీ సురక్షితమైన తాగునీరు అందించేందుకు ఆర్వో వాటర్ ప్లాంట్ సౌకర్యాలు రూపుదిద్దుకున్నాయి. బాలికల ఉన్నత పాఠశాల హెచ్‌ఎంగా బాధ్యతలు చేపట్టిన శ్రీదేవి ఆమె మామ మద్దిపాటి శివన్నారాయణ స్ఫూర్తితో పాఠశాలను ప్రణాళికబద్ధంగా సమష్టి కృషితో అభివృద్ధి చేయడం చేస్తున్నారు. దెందులూరు, పెదవేగి ఎంఈఓలు కే. అన్నమ్మ, సీహెచ్ బుద్ధావ్యాస్, దెందులూరు గ్రామస్తులు హెచ్‌ఎం శ్రీదేవిని అభినందించారు.

బడి ఈడు పిల్లలంతా చదువుకోవాలి



భీమడోలులో మాట్లాడుతున్న ఎంపీడీవో సీహెచ్ పద్మావతి దేవి, చిత్రంలో ఎంఈవో

భీమడోలు: డ్రాపవుట్స్ రహిత మండలంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని భీమడోలు ఎంపీడీవో సీహెచ్ పద్మావతి దేవి అన్నారు. భీమడోలు ఎంఆర్సీలో శనివారం డ్రాపవుట్స్ నమోదు, వారిని పాఠశాలలు, కళాశాలల్లో చేర్పించడం, నాడు- నేడు పనుల పురోగతిపై ఎంఈవో ఈదుపల్లి శ్రీనివాసరావుతో కలిసి ఆమె హెచ్‌ఎంలు, వెల్ఫేర్ అసిస్టెంట్లతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండల వ్యాప్తంగా 1,450 మంది డ్రాపవుట్స్‌గా గుర్తించామన్నారు. 18 ఏళ్ల లోపు వారిని విధిగా పాఠశాలల్లో, కళాశాలల్లో విధిగా చేర్పించాల్సిన బాధ్యత ప్రధానోపాధ్యాయులు, వెల్ఫేర్ అసిస్టెంట్లపై ఉందన్నారు. 18 ఏళ్లు దాటిన వారి వివరాలతో నివేదికలను వెంటనే సమర్పించాలన్నారు. మండలంలో నాడు-నేడు పనులను యుద్ధ ప్రాతిపదికను పూర్తి చేయాలన్నారు. నాడు-నేడు పథకం పనులు రెండో విడత 21 పాఠశాలల్లో కొనసాగుతున్నాయన్నారు. మండలంలో రూ.2.57 కోట్ల మంజూరు కాగా ఇప్పటి వరకు రూ.2.24కోట్ల వెచ్చించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

దోమలతో ప్రాణాంతక వ్యాధుల వ్యాప్తి



పోలసానిపల్లిలో వైద్య ఆరోగ్య సిబ్బందితో మాట్లాడుతున్న బి.సుబ్రహ్మణ్యేశ్వరి

భీమడోలు: దోమలతో ప్రాణాంతక వ్యాధులు వ్యాప్తి చెందుతాయని, సీజనల్ వ్యాధులపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని జోనల్ మలేరియా అధికారిణి డాక్టర్ బి.సుబ్రహ్మణ్యేశ్వరి అన్నారు. పోలసానిపల్లిలో ఇటీవల డెంగీ కేసు నమోదైనందున శనివారం బాధిత వ్యక్తిని వైద్యశాఖ అధికారులు పరామర్శించారు. కుటుంబ సభ్యులకు ఆరోగ్య సూత్రాలను వివరించారు. వైద్య ఆరోగ్య సిబ్బందికి సూచనలు అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాలనీలో వైరల్ జ్వరాలపై ఇంటింటికీ వెళ్లి వైద్య ఆరోగ్య సిబ్బంది అవగాహన కల్పించాల్సిన బాధ్యత ఉందన్నారు. వర్షాకాలంలో తేమ వాతావరణంగా ఉన్నందున వైరస్‌లు ప్రబలుతాయని, తద్వారా జ్వరాలు విజృంభించే అవకాశముందన్నారు. వైరస్ జ్వరాలు దోమలు కుట్టడం వల్ల ప్రబలుతాయని, ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. జ్వరాలు వస్తే విధిగా పీహెచ్‌సీలు, విలేజ్ హెల్త్ క్లినిక్‌లను సంప్రదించాలన్నారు. ప్రభుత్వం సీజనల్ వ్యాధులు ప్రబలుకుండా ప్రత్యేక చర్యలు చేపట్టిందన్నారు. ఆరోగ్య కార్యకర్తలు, ఆశావర్కర్లు, ఎంఎల్‌హెచ్‌పీలు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మలేరియా అధికారి జే.గోవిందరావు, సూపర్‌వైజర్ రామకృష్ణ, సిబ్బంది రమేష్, ఏఎన్‌ఎంలు, సిబ్బంది పాల్గొన్నారు.

30న నారాయణపురంలో జాబ్ మేళా



ఉంగుటూరులో పోస్టర్‌ను ఆవిష్కరించిన జెడ్పీటీసీ కె.జయలక్ష్మి, ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి

ఉంగుటూరు: ఈనెల 30న నారాయణపురం అరవింద శత జయంతి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జెడ్పీటీసీ కొరిపల్లి జయలక్ష్మి వెల్లడించారు. శనివారం దానికి సంబంధించిన కరపత్రాలను ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి, ఎంపీటీసీ సభ్యులతో కలిసి మండల పరిషత్ కార్యాలయం వద్ద ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ జయలక్ష్మి మాట్లాడుతూ నియోజకవర్గంలోని యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. 30వ తేదీన ఉదయం 9 గంటల నుంచి నిర్వహించనున్న ఈ జాబ్‌మేళాలో 15 కంపెనీలు పాల్గొని వెయ్యి మందికి ఉపాధి కల్పిస్తారని తెలిపారు. ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి మాట్లాడుతూ ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు సహకారంతో నిర్వహిస్తున్న ఈ జాబ్‌మేళాను యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి గంట సుధాకర్, సచివాలయాల మండల కన్వీనర్ పెనుగొండ బాలకృష్ణ, ఉంగుటూరు 2 ఎంపీటీసీ సందక రాంబాబు, సొసైటీ అధ్యక్షుడు పాపారావు బాబ్జి, ఎంపీడీవో అంజనేయబాబు, జిల్లా ప్లేస్‌మెంటు ఆఫీసరు కె.ప్రవీణ్, కోఆర్డినేటర్లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

విద్యార్థులకు భోజన కంచాల వితరణ

పెదపాడు: ఏపూరు గ్రామానికి చెందిన కొండపావులూరి అశోక్ జ్ఞాపకార్థం వారి సోదరి కండెపునేని సుష్మ, అరుణ్‌కుమార్ దంపతులు ఏపూరు, తిమ్మనవీడు, ఆంధ్రేయపురం పాఠశాలల్లోని విద్యార్థులు 110 మందికి భోజనం కంచాలను శనివారం పంపిణీ చేశారు. మానవత సంస్థ ద్వారా కండెపనేని గాయత్రి చేతుల మీదుగా వీటిని పంపిణీ చేశారు. మానవత రాష్ట్ర కన్వీనర్ మారుబోయిన కోటేశ్వరరావు, అధ్యక్షుడు కూరెళ్ల సుబ్బాచారి, కార్యదర్శి కళ్లేపల్లి నారాయణరావు పాల్గొన్నారు.

స్వచ్ఛత లక్ష్య సాధనకు ప్రజలంతా సహకరించాలి



గుండుగొలనులో క్లాప్ మిత్రలను సత్కరిస్తున్న డీపీవో తూతిక విశ్వనాథ్ శ్రీనివాస్, ఉపసర్పంచ్ ముదుండి సూర్యనారాయణరాజు తదితరులు

భీమడోలు: ప్రజారోగ్యమే స్వచ్ఛత సేవ లక్ష్యమని, స్వచ్ఛత లక్ష్య సాధనకు ప్రజలంతా సహకరించాలని జిల్లా పంచాయతీ అధికారి తూతిక విశ్వనాథ్ శ్రీనివాస్ అన్నారు. స్వచ్ఛత కార్యక్రమాన్ని పురస్కరించుకుని శనివారం గుండుగొలనులో ఆయన కాఫీ విత్ క్లాప్ మిత్ర కార్యక్రమంలో పాల్గొని వారితో కలిసి కాఫీ తాగారు. ఉప సర్పంచ్ ముదుండి సూర్యనారాయణ రాజుతో కలిసి ఆయన క్లాప్ మిత్రలతో ముచ్చటించారు. పరిసరాలను పరిశుభ్రత పర్చుతూ ప్రజా ఆరోగ్యమే లక్ష్యంగా పని చేస్తున్న క్లాప్ మిత్రలను దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. తొలుత ఇంటింటికీ వెళ్లి చెత్తను సేకరించే ట్రాక్టర్‌ను ఆయన నడిపారు. అనంతరం గ్రామంలోని వీధుల్లో అవగాహన ర్యాలీ, ప్రదర్శన నిర్వహించారు. కూడలి ప్రాంతాల్లో సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, విద్యార్థులతో కలిసి మానవహారంగా ఏర్పడి ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే అనర్థాలపై నినదించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమానికి ఉపసర్పంచ్ ముదుండి సూర్యనారాయణరాజు అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా డీపీవో తూతిక విశ్వనాథ్ శ్రీనివాస్ హాజరయ్యారు. స్వచ్ఛ ఆంధ్ర, భారత్ ఉద్యమంలో ప్రజలంతా భాగస్వాములు కావాలని డీపీవో పిలుపు నిచ్చారు. బాపూజీ కలలు కన్న స్వరాజ్య స్థాపన స్వచ్ఛతాహీ సేవతో సాధ్యమన్నారు. ఈవోఆర్డీ సుందరి, గ్రామకార్యదర్శి మురళి, వార్డు సభ్యులు, వీఆర్వోలు శంకర్, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఘనంగా ఎన్ఎస్ఎస్ ఆవిర్భావ దినోత్సవం



నారాయణపురం డిగ్రీ కళాశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న నిర్మల జ్యోతి

ఉంగుటూరు: విద్యార్థుల్లో జాతీయత, సేవాభావం పెంపొందించేందుకు జాతీయసేవా పథకం 1969లో ఎన్ఎస్ఎస్‌ను స్థాపించారని ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ కొండా రవి అన్నారు. శనివారం నారాయణపురం అరవింద శత జయంతి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రవి మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ శిక్షణ ద్వారా విద్యార్థులకు సామాజిక సమస్యలపై అవగాహన, వాటిని పరిష్కరించడం అలవాటు అవుతుందని తెలిపారు. చేబ్రోలు పీహెచ్‌సీ సూపర్‌వైజరు నాగలక్ష్మి మాట్లాడుతూ ప్రతి గ్రామంలో ప్రాథమిక వైద్యశాలకు అనుబంధంగా ఉన్న వైద్య కేంద్రాలను రోగులు వినియోగించుకోవాలన్నారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసరు నిర్మల జ్యోతి మాట్లాడుతూ జాతీయ సేవా పథకం లక్ష్యాలను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం విజయకుమారి, అధ్యాపకులు బాబూరావు, ఉమాశంకర్, హెప్సిబా, విద్యార్థులు పాల్గొన్నారు.

పీఎం విశ్వకర్మ యోజనకు దరఖాస్తు చేసుకోండి



ఏలూరు పాతబస్టాండ్ సెంటర్‌లో చర్మకారులతో మాట్లాడుతున్న పాలిమేర హరికృష్ణ

ఏలూరు (టూటౌన్): రాష్ట్రంలోని చర్మకారులు తమ ప్రాంతాల్లో ఉన్న కామన్ సర్వీసు సెంటర్‌లో కానీ, సచివాలయంలో కానీ పీఎం విశ్వకర్మ యోజన ద్వారా అందించే రూ.లక్ష రుణ సదుపాయాన్ని పొందేందుకు దరఖాస్తు చేసుకోవాలని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పొలిమేర హరికృష్ణ కోరారు. స్థానిక పాతబస్టాండ్ సెంటర్‌లోని పలువురు చర్మకారులకు ఈ పథకంపై శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ రుణాన్ని పొందడం ద్వారా వ్యాపారాలు అభివృద్ధి పరుచకోవాలని కోరారు. ప్రభుత్వం అందించే రుణాన్ని అందుకొని ఐదు శాతం వడ్డీతో తిరిగి చెల్లించి, తర్వాత రూ.2 లక్షలు రుణాన్ని పొందాలన్నారు. మార్కెట్‌లో ఎస్టీడీ వడ్డీల బారీన పడకుండా చేతివృత్తుల వారందరూ ఈ పథకాన్ని అందిపుచ్చుకొని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఏలూరు ప్రాంతంలో అధిక సంఖ్యలో చర్మకారులకు పింఛన్లు ఇప్పించిన మాజీ డిప్యూటీ సీఎం ఆళ్ల నానికి ఈ సందర్భంగా ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. త్వరలో ఏలూరులో రాష్ట్ర చర్మకారుల సంఘం 30 వసంతాల వేడుకను నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి బేవనపల్లి లక్ష్మణరావు, నగర సంఘం అధ్యక్షుడు బోదిమెళ్ళ నాగరాజు, నాయకులు పొలిమేర దుర్గారావు, మంద పాటి ఏసు, ఉలసాల పోతురాజు, చీలి వీరబాబు, పులసల మధుబాబు, చింతాటి వెంకన్న, కటారి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

భూ వివాదాలకు శాశ్వత పరిష్కారమే లక్ష్యం



కోడూరుపాడులో సర్వేయర్లు, కార్యదర్శులతో మాట్లాడుతున్న కోఆర్డినేటర్ నిఖిల్

భీమడోలు: భూ వివాదాలు పరిష్కారమే జగనన్న భూ హక్కు, భూరక్ష పథకం లక్ష్యమని కోడూరుపాడు, దుద్దేపూడి సర్పంచులు మానుకొండ నాగేశ్వరరావు, నీలం శ్రీనివాసరావు అన్నారు. కోడూరుపాడు పంచాయతీ కార్యాలయం వద్ద శనివారం జిల్లా శిక్షణ కేంద్రం నుంచి వచ్చిన సచివాలయ గ్రామ కార్యదర్శులకు నాల్గవ విడత వైఎస్సార్ జగనన్న భూహక్కు, భూరక్ష పథకం సర్వేపై వారికి శిక్షణ తరగతులను ప్రారంభించారు. గ్రామస్థాయిలో పర్యటనకు వచ్చిన గ్రామ కార్యదర్శులకు కోఆర్డినేటర్ నిఖిల్ అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి సర్పంచ్ మానుకొండ నాగేశ్వరరావు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఈవోఆర్డీ సుందరి మాట్లాడుతూ గ్రామాల్లో దశాబ్దాలుగా ఉన్న భూ సమస్యలకు ఈ సర్వేతో చెక్ పడుతుందన్నారు. భూ తగదాలను పరిష్కరించి లబ్ధిదారులకు శాశ్వత పట్టాను అందిస్తామన్నారు. జిల్లాలోనే కోడూరుపాడులో పూర్తిస్థాయి సర్వే పూర్తయ్యిందన్నారు. గ్రామాల్లోని ప్రజలకు ఈ విధానంపై అవగాహన కల్పించాల్సిన బాధ్యత కార్యదర్శులపై ఉందన్నారు. తొలుత గ్రామ కార్యదర్శి వెజ్జు ధర్మా సర్వేపై శిక్షణ అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని సచివాలయ సర్వేయర్లు, వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

30 నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష

పెదవేగి : పెదవేగి మండలంలో ఈ నెల 30 నుంచి ప్రారంభమయ్యే జగనన్న ఆరోగ్య సురక్ష పథకాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని పీహెచ్సీ వైద్యాధికారిణి డాక్టర్ మాధవి సూచించారు. శనివారం ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ప్రతి ఒక్కరికీ వైద్యం అందిస్తామన్నారు. ఆరోగ్యపరంగా సమస్యలు ఉన్నవారు గ్రామంలో నిర్వహించే వైద్య శిబిరాల్లో వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆమె తెలిపారు.

నేడు ఎమ్మెల్యే కార్యాలయంలో జాబ్‌మేళా

దెందులూరు: ఏలూరులోని ఎమ్మెల్యే కార్యాలయంలో ఆదివారం ఉదయం 9 గంటలకు జాబ్‌మేళా నిర్వహించనున్నారు. ప్రముఖ ఫార్మసీ కంపెనీల ప్రతినిధులు ఈ జాబ్‌మేళాలో పాల్గొంటారని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. బీఫార్మసీ, బీఎస్సీ కెమిస్ట్రీ అభ్యర్థులు బయోడేటా జెరాక్స్, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు, సర్టిఫికెట్లు, ఆధార్ కార్డుల జెరాక్స్‌లతో నిరుద్యోగ యువత జాబ్‌మేళాకు హాజరుకావాలని ఆయన కోరారు.

పిల్లల ఆలోచనలు తల్లిదండ్రులు తెలుసుకోవాలి

పెదవేగి : పిల్లలు వారి ఆలోచనలను తెలుసుకోవలసిన బాధ్యత ప్రతి తల్లిదండ్రులపై ఉందని పిల్లలు ఎందుకు మానసిక వత్తిడికి గురవుతున్నారనే విషయాలు ముందుగానే పసిగట్టి తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని చైల్డ్ సైకాలజిస్ట్ వి హిమబిందు అన్నారు. పెదవేగి మండలం కొప్పాకలోని జిల్లా పరిషత్ హైస్కూల్లో చైల్డ్ రైట్స్ అడ్వకేసి ఫౌండేషన్ క్రాప్ ఆధ్వర్యంలో స్కూల్ ప్రధానోపాధ్యాయుల సహకారంతో శనివారం బాలల రక్షణపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు అంశంపై తల్లిదండ్రులతో, విద్యార్థులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తొమ్మిది, పది తరగతుల విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు పిల్లల మానసిక ఒత్తిడికి కారణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను ముఖ్యఅతిథిగా విచ్చేసిన చైల్డ్ సైకాలజిస్ట్ వి హిమబిందు వివరించారు. మానసిక ఒత్తిడికి గురైన విద్యార్థులకు కౌన్సెలింగ్ ఇప్పించాలని సూచించారు. బాగా చదివి ఉన్నత స్థానాలను అందిపుచ్చుకోవాలని విద్యార్థులకు తెలియజేశారు. ప్రధానోపాధ్యాయులు ఆర్ .శైలజ, గ్రామ సచివాలయ మహిళా పోలీస్ డి కుసుమ సాయి శ్రీ, క్రాప్ జిల్లా కోఆర్డినేటర్ ఎస్ రవిబాబు , ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వేదం హిందూ ధర్మానికి మూలం

ఏలూరు (ఆర్ఆర్‌పేట) : వేదం హిందూ ధర్మానికి మూలమని, వేదం పదికాలాల పాటు నిలబడితే హిందూ ధర్మం కూడా పది కాలాల పాటు నిలబడుతుందని రాష్ట్ర ప్రణాళికా బోర్డు వైస్ చైర్మన్ మల్లాది విష్ణు అన్నారు. శనివారం ఏలూరు జిల్లాలో వివిధ కార్యక్రమాల్లో పాల్గొనే నిమిత్తం ఏలూరు నగరానికి విచ్చేసిన విష్ణు ఉదయం స్థానిక సంస్కృత వేద పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందూ సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. నగరంలో వేదాలు నేర్పడానికి ఏర్పాటు చేసిన ఈ పాఠశాల ద్వారా వేద పండితులు తయారు కావాలని ఆశాభావం వ్యక్తం చేశారు. సంస్కృత వేద పాఠశాల స్థలం వివాదం విషయంలో ఎమ్మెల్యే ఆళ్ళ నాని చేసిన సిఫార్సులను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతానని ఆయన స్పష్టం చేశారు. ఏపీ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు సత్యవాడ దుర్గా ప్రసాద్, సంస్కృత వేద పాఠశాల అధ్యక్ష, కార్యదర్శులు ఈదర వెంకట రమణ ప్రసాద్, తూములూరి విశ్వనాథ శాస్త్రి, సలహాదారు బీకేఎస్ఆర్ అయ్యంగార్ తదితరులు పాల్గొన్నారు.